అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 2 సంచిక -80 శుక్రవారం 30 మే 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



6లో

విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

# ట్రంప్ కు భయపడి యుద్ధం ఆపారు...

## మోదీ కాలం చెల్లిన రూపాయి : రేవంత్ రెడ్డి ఫైర్

### ఇందిరమ్మ ధైర్యం మోదీలో లేదు దేశ ఆత్మగౌరవాన్ని ట్రంప్ కాళ్ల దగ్గర పెట్టాంటూ ఆగ్రహం

హైదరాబాద్ **మే29(జర్నలిస్ట్ వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి, పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ప్రధాని మోదీ అర్థాంతరంగా నిలిపివేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. మిగతాది 2లో...



# ఐదు కమిటీలను ప్రకటించిన ఎఐసిసి

- పొలిటికల్ అఫైర్స్, అడ్వయిజరికమిటీలకు మీనాక్షి సారథ్యం
- క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా మల్లురవి
- డీలిమిటేషన్ కమిటీకిచల్లా వంశీచందర్‌రెడ్డి,
- సంవిధాన్‌బచావో ప్రోగ్రామ్ వినయ్‌కుమార్ నేతృత్వం
- వేణుగోపాల్ ఆదేశాలు జారీ




హైదరాబాద్ **మే29(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ కాంగ్రెస్‌కు ఐదు కమిటీలను ఏఐసిసి గురువారం ప్రకటించింది. దీనికి సంబంధించి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీల్లో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ, అడ్వయిజరీ కమిటీ, డీలిమిటేషన్ కమిటీ, సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీతో పాటు క్రమశిక్షణా కమిటీలను ఏర్పా టు చేస్తూ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలోపొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, మిగతా 2లో...

# గద్దర్ అవార్డుల ప్రకటన

- ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ
- ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్
- ఉత్తమ నటిగా నివేదా థామస్
- ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్
- వివరాలు ప్రకటించి జయసుధ, దిల్‌రాజ్



8లో

# బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసే కుట్రలు

- కల్వకుంట్ల కుటుంబలో రాజకీయ తుఫాన్
- కెసిఆర్ మాత్రమే మా నాయకుడు
- ఆయనను నడిపించే మొగోళ్లా మీరు
- కెసిఆర్ తప్ప మరొకరి నాయకత్వాన్ని అంగీకరించం
- కెసిఆర్‌కు నోటీసులు వచ్చినా స్పందించని నేతలు
- కావాలనే నిజామబాద్‌లో నన్ను ఓడించారు
- నా జోలికి వస్తే...నేనసలే మంచిదాన్ని కాదు
- కెటిఆర్ లక్ష్యంగా నిప్పలు చెరిగిన సోదరి కవిత

హైదరాబాద్ **మే29(జర్నలిస్ట్ వార్త):** కెసిఆర్ కుటుంబ రాజకీయం ముదరి పాకాన పడింది. రాజీకయ తుఫాన్ చెలరేగింది. తీవ్ర వాయుగుండంగా మారింది. తీరం ఎక్కడ ఎలా దాటుతుందో కానీ..అలజడి సృష్టిస్తోంది.గాలిబుడగలా ఉన్న ఐక్యత పేలింది. మిగతా 2లో...



# ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

తొలి బడి అమ్మ ఒడి .. మలి బడి అంగన్‌వాడీ

సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క




భద్రాద్రి **మే29(జర్నలిస్ట్ వార్త):** తొలి బడి అమ్మ ఒడి అయితే... .. మలి బడి అంగన్‌వాడీ బడి అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు,సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా మంత్రి పాత కొత్తగూడెం నుంచి పెనుబల్లి రోడ్డు వద్ద 6.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి పనులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు- చేసిన ఇందిరమ్మ అమృతం పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మిగతా 2లో...

# జూరాల ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తివేత



**మే29(జర్నలిస్ట్ వార్త):** మహారాష్ట్ర, కర్ణాటకలలో కృష్ణ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల జలాశయానికి భారీగా వరద నీరు వస్తోంది. గురువారం సాయంత్రం 66 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో అప్రమత్తమైన అధికారులు 10 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం రాత్రి వరకు జూరాలకు వచ్చే వరద లక్ష క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉందని జూరాల ప్రాజెక్టు ఈఈ జుబేర్ అహ్మద్ తెలిపారు. గత 18ఏళ్ల కాలంలో మే నెలలో జూరాల జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారని పరీవాహక గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

# 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

ధరణి కష్టాలు రిపీట్ కాకుండా భూమాత

భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



# తల్లుల కన్నీటికి బదులు తీర్చుకున్నాం

- పాకిస్థాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాం
- పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం
- సిక్కిం 50వ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో వర్చువల్‌గా ప్రధాని ప్రసంగం

**మే29(జర్నలిస్ట్ వార్త):** పహల్గామ్ ఉగ్రదాడిని మానవత్వంపై జరిగిన ఘోరమైన దాడిగా అభివర్ణించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఈ దాడిలో తల్లుల సిందూరాన్ని దూరం చేసిన వారికి 'ఆపరేషన్ సిందూర్' రూపంలో గట్టి సమాధానం ఇచ్చామని స్పష్టం చేశారు. ఉగ్రవాదులు మన దేశాన్ని విభజించాలని చూశారని, మతం పేరుతో పాకిస్థాన్ విభజన రాజకీయాలకు పాల్పడిందని ఆయన ..ఆరోపించారు మిగతా2లో...



# బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసే కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)
కెసిఆర్ నాయకత్వాన్ని కెటిఆర్ హైజాక్ చేసి గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై సోదరి కవిత బాంబు పేల్చారు. కెసిఆర్ నాయకత్వం తప్ప ఎవరి నాయకత్వాన్ని అంగీకరించేది లేదని సోదరుడు కెటిఆర్‌కు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీని ఇష్టారీతిన నడుపుతూ...బిజెపికి గొడుగు కిందకు చేరుస్తున్నారంటూ మండిపడ్డారు. వందిమాగధులతో విమర్శలు చేయిస్త ఊరుకునేది లేదని ఘాటు హెచ్చరికలు చేశారు. తనను సవాల్చేయాలనకుంటే ఉఫ్‌న ఊదేస్తానని హెచ్చరించారు. ట్విట్టర్ రాజకీయాలను సహించేది లేదని తేల్చారు. మొత్తంగా అన్న కెటిఆర్‌పై కవిత యుద్ధం ప్రకటించారు. పట్టుతప్పుతున్న పార్టీని కాపాడుకోవడమే తన లక్ష్యమని చెప్పకనే చెప్పారు. ఈ మేరకు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం కవిత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు నీతులు చెబుతోన్న బీఆర్ఎస్ పార్టీ నేతలు.. తెలంగాణ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలంటూ సూచించారు. కేసీఆర్ నీడలో పని చేస్తోన్న వారు.. తనపై ప్రతాపం చూపిస్తున్నారంటూ మండిపడ్డారు.బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని ఆమె తెలిపారు. తాను జైలులో ఉన్నప్పుడే కుట్ర మొదలైందన్నారు. ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తారా అని పరోక్షంగా కెటిఆర్ మండిపడ్డారు. జైలుకు వెళ్లేటప్పుడే పార్టీకి రాజీనామా చేస్తానన్నానని తెలిపానని అన్నారు. పార్టీ సోషల్ మీడియాలో తనను టార్గెట్ చేశారని, తన లేఖ లీక్ చేసిందెవరో చెప్పాల్సిందేనని మండిపడ్డారు. లీకు వీరులను పట్టుకోమంటే, గ్రీకువీరులు దండెత్తారని మండిపడ్డారు. తన జోలికి వస్తే బాగుండదని అంటూనే తానసలే మంచిదానిని కాదన్నారు. కేసీఆర్‌ను తామే నడిపిస్తున్నామని చెప్పుకుంటున్నారని, కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లా మీరు..అని ప్రశ్నించారు. తనపై తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు వస్తే ఎందుకు నిరసనలు తెలపలేదని, ఇంకో నేతకు నోటీసులు వస్తే ఎందుకు హంగామా చేశారని ప్రశ్నించారు. తాను వాళ్లలా చిల్లర రాజకీయాలు చేయనని, హుందాగా ఉంటానని పేర్కొన్నారు. పార్టీ చేయాల్సిన పనులు జాగృతి తరపున చేస్తున్నానని, కోవర్టులు ఉన్నప్పుడు ఎందుకు పక్కన పెట్టడం లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ ఒక్కరే నాయకుడని, పార్టీలో ఇంకెవరి నాయకత్వాన్ని అంగీకరించనని నిర్మొహ మాటంగా తేల్చేసారు. మా నాన్నకు తాను లేఖ రాస్తే తప్పేంటి? అయినా నీకు నొప్పి ఏందిరాబయ్? అంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత తన అన్న కెటిఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. ఇంటి ఆడబిడ్డపై ఎటు పడితే అటు మాట్లాడితే సరి కాదన్నారు. దమ్ముంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీపై మీ ప్రతాపం చూపించాలంటూ ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆమె సవాల్ విసిరారు. తాను అసలే మంచి దాన్ని కాదని.. తాను నోరు విప్పితే తట్టుకోలేరంటూ బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయకుండా.. ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? అంటూ ఆమె ప్రశ్నించారు. తనను రేవంత్ రెడ్డి కోవర్ట్ అనటం కరెక్టేనా అని నిలదీశారు. పెయిడ్ ఆర్టిస్ట్‌లతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో రాయబారాలు జరిపే అవసరం తనకు లేదన్నారు. తనకు, కేసీఆర్ మధ్య దూరం పెంచే కుట్ర జరుగుతోందన్నారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభమో అందరికీ తెలుసునని, కావాలనే తనను ఎంపీ ఎన్నికల్లో ఓడించారని కూడా కవిత భగ్గుమన్నారు. పార్టీని బీజేపీలో కలపాలని చూస్తున్నారు. బీజేపీలో విలీనం చేయొద్దని చెప్పాను. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై.. నేను జైల్లో ఉన్నప్పుడే అడిగితే చెప్పాను. 101 శాతం బీజేపీలో కలిపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఉంటే బీజేపీలో కలపడం కుదరదని.. అందుకే నన్ను కేసీఆర్‌కు దూరం చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై, తన రాజకీయ భవిష్యత్తుపై జరుగుతున్న కుట్రలపై స్పష్టంగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లోనే ఉన్న కొందరు కోవర్టులు నన్ను ఓడించేందుకు ప్రయత్నించారని, పేయిడ్ న్యూస్‌లు వేసి, లేఖల్ని లీక్ చేసి, బీజేపీలోకి బీఆర్ఎస్‌ను కలిపే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండాలంటే ట్వీట్లు- చేయడం మాత్రమే కాదు, కార్యాచరణ చూపించాలి. పార్టీ నడిపించే సత్తా మీకు లేదని నన్ను తప్పుబడుతున్నవారు ముందుగా వాళ్లు ఏం చేశారో చెప్పాలని అంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు.తమపై కుట్రలు జరుగుతున్నాయని, తనను బీఆర్ఎస్ నుంచి బయటకు నెట్టాలని ప్రయత్నాలు జరుగు తున్నాయని కవిత ఆరోపించారు. నాకు ఒక్క నాయకుడు మాత్రమే ఉన్నాడు..ఆయన కేసీఆర్. కొత్త పార్టీలు ఎందుకు..ఉన్న బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను కాపాడితే చాలు. తెలంగాణ జాగృతి ద్వారా నేను పార్టీకి, రాష్ట్రానికి సేవ చేస్తున్నా,అని స్పష్టం చేశారు. నేను పదవులు అడిగినవాళ్లలోని కాదు. కేసీఆర్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో పని చేస్తున్నా. నా కడుపులో బిడ్డ ఉన్నప్పుడు కూడా తెలంగాణ కోసం పోరాడిన నేను.మామూలు నాయకురాలు కాదు. నాతో పెట్టుకుంటే తీపిగా ఉండదని ఇప్పటికైనా గ్రహించాలి,అంటూ కవిత మరోసారి వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ నేతలకు చెందిన హాస్పిటల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్ళింది ఎవరో అందరకీ తెలుసునంటూ పార్టీలోని అగ్రనేతలను ఆమె పరోక్షంగా విమర్శించారు. తన లేఖ లీక్ చేసిందెవరు తేల్చమంటే.. తనపై పడి ఏడుస్తున్నారంటూ మండిపడ్డారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించారన్నారు. కేసీఆర్ లెక్క.. తాను చాలా తిక్కదానినని ఆమె పునరుద్ఘాటించారు. వెన్నుపోటు రాజకీయాలు తనకు రావని.. సూటిగా మాట్లాడుతానని కుండ బద్దలు కొట్టారు. సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానన్నారు. మావాళ్ళు కొందరు..సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. వారు స్థాయికి మించి ఊహించుకుంటు న్నారంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ సభ తమ వలనే సక్సెస్ అయిందని కొందరు ఊహించు కుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్ద వాళ్ళు అయిపోయామని వారంతా భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిజామాబాద్ ఎంపీగా తనను ఓడించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా ఉండగా చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఏమి చేసినా.. కేంద్రం అడ్డుకోవటం లేదని ఒకింత అసహనాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇప్పటికీ గోదావరి నదీ జలాలు పంపకం సరిగా జరగలేదన్నారు. ఏపీ చేపట్టనున్న బనకచర్ల ప్రాజక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే తన నాయకుడని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ తప్ప.. ఇతర నేతల నాయకత్వంలో తాను పనిచేయనని కుండ బద్దలు కొట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న వారిని గౌరవిస్తానని కవిత పేర్కొన్నారు.

# ట్రంప్ కు భయపడి యుద్ధం ఆపారు...

(మొదటి పేజీ తరువాయి)
దేశ భద్రత విషయంలో ప్రధాని మోదీ తీరుపై పలు ప్రశ్నలు సంధించారు. గురువారం మేడ్చల్ నియోజకవర్గంలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జై హింద్ యాత్ర' అనంతరం నిజాంపేటలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి తాము పూర్తిగా సహకరించాం. యుద్ధం చేయాలంటే ధైర్యం, వెన్నెముక, సరైన యుద్ధతంత్రం ఉండాలి. కేవలం నాలుగు రోజులు యుద్ధం చేసి, మధ్యలోనే ఎందుకు ఆపేశారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభించే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం, యుద్ధాన్ని నిలిపివేసే సమయంలో ఎందుకు సంప్రదించలేదని ఆయన నిలదీశారు. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపించానని ప్రకటించారు. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు? ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం, మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు పెడతారా?" అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గతంలో ఇందిరా గాంధీ ప్రదర్శించిన ధైర్యాన్ని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. "భారత్ వైపు కన్నెత్తి చూస్తే కనుగుడ్లు పీకేస్తామని చైనాను ఇందిరాగాంధీ హెచ్చరించారు. నాడు యుద్ధం ఆపాలని అమెరికా అధ్యక్షుడు బెదిరించినా ఇందిరా గాంధీ లొంగలేదు. అలాంటి యుద్ధతంత్రాన్ని ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు" అని అన్నారు. పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పాలంటే సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకోవాలని తాము మోదీకి సూచించామని తెలిపారు. 1971 యుద్ధంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాకిస్థాన్‌ను ఓడించిందని గుర్తుచేశారు."మేం నిర్వహించిన ఈ యాత్ర ఎన్నికలు, ఓట్ల కోసం కాదు. సైనికుల ఆత్మస్థైర్యం, దేశ ఆత్మగౌరవం నిలబెట్టడం కోసం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమంటే అది చేతకాదు కానీ, కాంగ్రెస్‌ను విమర్శిస్తారు. యుద్ధంలో ఎన్ని రఫేల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పాలి" అని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో నడవాలని ప్రధానికి హితవు పలికారు. దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని, ప్రధాని మోదీ కాలం చెల్లిన రూపాయి అని వ్యాఖ్యానించారు.ఈ జై హింద్ యాత్ర బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు సాగింది. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడించినా, 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపీగా గెలిపించారని, ఆ తర్వాత తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ప్రజల ముందుకొచ్చానని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

# 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

## ధరణి కష్టాలు రిపీట్ కాకుండా భూమాత - భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ఖమ్మం, **మే29(జర్నలిస్ట్ వార్త):** జూన్2 న భూమి లేని నిరుపేద రైతులు ఎవరైతే అసైన్డ్ భూములను సేద్యం చేస్తున్నారో వారికి పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులతో జరిగిన సమావేశంలో పొంగులేటి కీలక సూచనలు చేశారు. ధరణిలో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు- జరగొద్దని తెలిపారు. చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దని స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. ఫారెస్ట్



అధికారులు సంయమనం పాటించాలని తెలిపారు. గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు, ఒక్క కొత్త చెట్టు- కూడా నరక నివ్వొద్దని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇదే అదును చూసుకొని అటవీ అధికారులు చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని.. ఇక నుంచి పోడు సాగుగూర్చి బానర్ ఐటమ్ కథనాలు రావొద్దన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం ఉన్నా రాష్ట్రాల్లో కూడా ఇంటికి 5 లక్షలు ఇవ్వడం లేదని.. పేదవాడికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, పైరవీలు చేయొద్దని తెలిపారు. ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఇల్లు ఇస్తే సస్పెండ్ కాదు, అంతకన్నా పెద్ద శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్న సహించేది లేదు... ఇందిరమ్మ ఇళ్ల ముసుగు లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. నియోజక వర్గానికి 3500 ఇల్లు కాకుండా ఐటిడిఎ పరిధిలో ఇంకా పెంచుదామని తెలిపారు.

# ఐదు కమిటీలను ప్రకటించిన ఏఐసిసి

(మొదటి పేజీ తరువాయి)
శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి, ఎంపిలు రేణుకా చౌదరి, బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, వి.శ్రీహరి ముదిరాజ్, బీర్ల అయిలయ్య, కె.ప్రేమ్‌సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జెట్టి కుసుమ కుమార్, ఈరావతి అనిల్‌కుమార్‌లతో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్‌లుగా నలుగురిని నియమించారు.
అడ్వయిజరీ కమిటీలో%ొ%అడ్వయిజరీ కమిటీలో మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సిఎం రేవంత్‌రెడ్డి, వి.హనుమంతరావు, కె.జానారెడ్డి, కె.కేశవరావు, మధుయాష్కీ గౌడ్, జి.చిన్నారెడ్డి, జె.గీతారెడ్డి, ఎం.అంజన్‌కుమార్ యాదవ్, జగ్గారెడ్డి, జాఫర్ జావీద్, టి.జీవన్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, రాములు నాయక్‌లను ఈ కమిటీలో నియమించారు.
డీ లిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా..డీ లిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా చల్లా వంశీచంద్ రెడ్డి, గద్వాల విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ శ్రావణ్‌కుమార్ రెడ్డి, పవన్ మల్లాడి, డి.వెంకటరమణలను ఏఐసిసి నియమించింది.క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా%ొ %క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా మల్లు రవి, వైస్ చైర్మన్‌గా శ్యాం మోహన్, సభ్యులుగా ఎం.నిరంజన్ రెడ్డి, బి.కమలాకర్ రావు, జాఫర్ జావేద్, డా.జివి రామకృష్ణలను జాతీయ కాంగ్రెస్ నియమించింది.సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ%ొ%సంవిధాన్ బచావో ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌గా పి.వినయ్‌కుమార్, సభ్యులుగా అద్దంకి దయాకర్, కె.శంకరయ్య, బాలు నాయక్, అరికెట నర్సిరెడ్డి, ఆత్రం సుగుణ, రాచమల్ల సిద్ధేశ్వర్, సంతోష్ కోల్‌కొండ, పి. అనిల్‌కుమార్, జూలూరి ధనలక్ష్మి, మాజిద్ ఖాన్, జి.రాములు, అర్జున్ రావు, శౌరి. కె.వల్లభరెడ్డి, వి.శ్రీకాంత్ రెడ్డిలను నియమించారు.

# ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)
అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిని ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, పిల్లలందరికీ నర్సరీ పాటలతో పాటు- ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి తల్లిదండ్రుల కష్టాలు వృదా చేయకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటు-గా తయారు చేస్తున్నామన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి 57 రకాల ఆట వస్తువులను అందుబాటు-లో ఉంచామన్నారు. త్వరలోనే గర్భిణులు కింద కూర్చోకుండా అన్ని కేంద్రాల్లో బల్లలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పథకం కింద మంజూరైన రూ.74.64 లక్షల చెక్కులను మంత్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎసే వారు ఏర్పాటు- చేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించి వేస్ట్ నుంచి బెస్ట్ రూపొందించిన కళాకృతులను చూసి అభినందించారు. ఆడపిల్లలకు శక్తినిద్దాం... ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఇందిరమ్మ అమృతం పథకాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐటీ-డీఏ పీవో రాహుల్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... కౌమార బాలికల్లో రక్తహీనత నివారించేందుకు ఇందిరమ్మ అమృతం పేరుతో ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం, కొమరంభీం ఆసీఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు- తెలిపారు. ఈ పథకం ద్వారా మూడు జిల్లాలో 50,269 మంది బాలికలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, సీపీవో సంజీవరావు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తల్లుల కన్నీటికి బదులు తీర్చుకున్నాం

అయితే, భారతీయులంతా ఐక్యంగా నిలిచి వారి కుట్రలను తిప్పికొట్టారని, పాక్ వైమానిక స్థావరాలను కూడా ధ్వంసం చేశామని గుర్తు చేశారు.సిక్కిం రాష్ట్ర 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రసంగించారు. వాస్తవానికి ఆయన సిక్కింలో నేరుగా పర్యటించాల్సి ఉన్నప్పటికీ, వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ పర్యటన రద్దయింది. దీంతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిక్కిం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సిక్కింను ప్రపంచ పర్యాటక చిత్రపటంలో ఒక ముఖ్యమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. "సిక్కింను కేవలం భారతదేశానికే కాకుండా, యావత్ ప్రపంచానికి ఒక హరిత ఆదర్శ రాష్ట్రంగా (గ్రీన్ మోడల్ స్టేట్) అభివృద్ధి చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.వికసిత్ భారత్ నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ, పేదలు, రైతులు, మహిళలు, యువత అనే నాలుగు బలమైన మూలస్తంభాలపై ఇది రూపుదిద్దుకుంటోందని ప్రధాని వివరించారు. సిక్కిం రైతులు వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ఇది రాష్ట్రంలోని యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిక్కిం ప్రజలకు ఆయన రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఢిల్లీకి చేరిన మాదిగ సామాజిక ఎమ్మెల్యేలు

## మంత్రివర్గంలో చోటు కోసం డిమాండ్

న్యూఢిల్లీ, **మే29(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ కేబినెట్ విస్తరణ వివాదం ఢిల్లీకిచేరింది. కేబినేట్‌లో తమకు అవకాశం ఇవ్వాలని మాదిగ సామాజికవర్గం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో నలుగురు తెలంగాణ కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు మకాం వేశారు. అడ్లూరు లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వం పల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతారావు ఢిల్లీకి వెళ్లారు. వీరు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వీరు కలువనున్నారు. మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను ఈ నలుగురు ఎమ్మెల్యేలు కోరనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీసీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌కు తెలిపే ఢిల్లీ వచ్చామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ అన్నారు. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్‌లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గమన్నారు. తమ సామాజిక వర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గ ప్రతినిధి ఉండాలన్నారు. మాదిగ వర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉందని తెలిపారు. మాలలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం పట్ల తమకు అభ్యంతరం లేదని చెప్పారు. మంత్రివర్గంలో ఎవరుండాలనేది నిర్ణయించేది అధిష్టానం కాబట్టి ఢిల్లీ వచ్చామన్నారు. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి కచ్చితంగా స్థానం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. మొదటి కేబినెట్ ఏర్పాటు-లోనే తమకు అవకాశం దక్కుతుందని భావించామని.. ఇప్పుడు రెండోసారి కేబినెట్ విస్తరణ జరుగుతుంది కాబట్టి ఇప్పుడు మరోసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాదిగ సామాజిక వర్గంలో ఏ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

**-డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క**

**-జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ**

**-ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి**

**-ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా**

**-వానాకాలం ముందస్తు సాగుకు రైతులను సన్నద్ధం చేయాలి**

**-వానాకాలం పంట సాగుకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు**

**-నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**-ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక, వ్యవసాయ శాఖ ముందస్తు సాగుపై ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్ లు, జిల్లా అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం, మంత్రులు**






**ఖమ్మం/మే29(జర్నలిస్ట్ వార్త):**

ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక, వ్యవసాయ శాఖ ముందస్తు సాగు వంటి పలు అంశాలపై ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు పెట్టే లక్షల రూపాయల పెట్టుబడి, వారి కష్టం వృధా అవుతుందని అన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అవసరమైన సహకారం తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారికి పుట్టగతులు లేకుండా చేయాలని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు కూడా పూర్తి చేశామని అన్నారు. 5 లక్షల రూపాయలతో పేదలకు ఇండ్లు కట్టించే పథకం దేశంలో ఎక్కడా లేదని, ఒకేసారి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం చాలా సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు. 22 వేల 500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని అన్నారు. మనిషికి భూమికు ఉన్న అనుబంధం గత ప్రభుత్వం ధరణి పేరుతో చాలా ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. భూ భారతి చట్టంతో ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజలకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందే వివిధ పథకాలు వివరించాలని అన్నారు. ఉదయం జాతీయ పతాకావిష్కరణతో పాటు సాయంత్రం అసెంబ్లీ నియోజకవర్గం హెడ్ క్వార్టర్ లో వేడుకలు నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఆసుపత్రి నిర్వహణ పకడ్బందీ ఉండాలని, అవసరమైన మందుల స్టాక్ పంపుతున్నామని, ప్రతి నెలా ఆరోగ్య శ్రీ, డ్రగ్స్ చెల్లింపులు పూర్తి చేస్తున్నామని అన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాల పై తీసుకుంటున్న చర్యలు వెంటనే పత్రికలు, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ర్యాండమ్ గా చెక్ చేయాలని, అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు చేరాలని మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్స్ మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులు పురోగతిని కూడా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు బాగా జరుగుతున్నాయని, ఈ సంఖ్య మరింత పెరగాలని అన్నారు. రుతుపవనాలు ముందుగా వచ్చిన నేపథ్యంలో వానాకాలం పంట సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందు బాటులో పెట్టాలని అన్నారు. రాష్ట్రంలోని పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పనులు 200 కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.

వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎరువుల, విత్తనాల కొరత రాకుండా జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉంటుందని అన్నారు. స్టాక్ వివరాలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ ప్రతి మండలంలో అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల స్టాక్ అందుబాటులో ఉండాలని అన్నారు. రెవెన్యూ , హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అసైన్మెంట్ భూములలో పోజిషన్ లో ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన ఉందని, వీటికి సంబంధించి ప్రతిపాదనలు ఉంటే సమర్పించాలని అన్నారు. సాదా బైనామా సంబంధించి ప్రభుత్వ భూములకు కూడా కొంతమంది దరఖాస్తులు చేసుకున్నారని, వీటిని తక్షణమే తిరస్కరించాలని మంత్రి ఆదేశించారు.

హై కోర్టు నుంచి స్టే తొలగిన వెంటనే అర్హత ఉన్న సాదా బైనామాలను పరిష్కరిస్తామని అన్నారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో తహసిల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని మంత్రి ఆదేశించారు. దేశంలో ఎక్కడా పేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వడం లేదని, లబ్ధిదారులను పూర్తి పారదర్శకంగా, నిరు పేదలను ఎంపిక చేయాలని అన్నారు. ఒత్తిడులకు లోనై అనర్హులకు ఎక్కడైనా ఇండ్లు మంజూరు చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పెట్టుబడి సొమ్ము లేకపోతే మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలని మంత్రి తెలిపారు. జూన్ 10 లోపు పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేసిన ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి కావాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం అవసరమైన ఇసుక లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచితంగా అందించాలని, ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమ ఇసుక రవాణా జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ఇంటి నిర్మాణం పరికరాల ధరల నియంత్రణ కు కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని అన్నారు. సగం దశలో మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నీటి పారుదల శాఖ పరిధిలో పెండింగ్ ఆపరేషన్ అండ్ మేయింటెనెన్స్ పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. పేదల సంతోషం కోసం ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉన్న సందేహాలను మంజూరు పత్రాల పంపిణీ సమయంలో నివృత్తి చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్ లో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేశామని, లక్షా 21 వేల మెట్రిక్ సన్న రకం ధాన్యం, 95 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి బోనస్ తో సహా చెల్లింపులు పూర్తి చేశామని అన్నారు.






వరంగల్, హన్మకొండ ప్రాంతాల్లో కూడా రైస్ మిల్లులకు అలాట్మెంట్ చేశామని అన్నారు. సన్న రకం ధాన్యంకు బోనస్ ప్రకటించడంతో ఖమ్మం జిల్లాలో సాగు పెరిగిందని, రాబోయే వానాకాలం పంట దాదాపు 6 లక్షల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నా మని కలెక్టర్ తెలిపారు. ఎక్కడా కల్తీ విత్తనాల విక్రయం జరగకుండా జాగ్రత్త వహిస్తున్నామని అన్నారు. గ్రామంలో ఎక్కడైనా కల్తీ విత్తనాలు విక్రయాలు జరిగితే వెంటనే సమాచారం తెలిసేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఎరువుల లభ్యతపై రెగ్యులర్ గా సమీక్ష చేసుకుంటూ ఎక్కడా కొరత రాకుండా చూస్తామని అన్నారు.

నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు క్రింద రెవెన్యూ సదస్సులు నిర్వహించామని అన్నారు. భూ సమస్యలపై నేలకొండపల్లి మండలంలో ప్రజల నుంచి 3224 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1791 సాధా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, ఫీల్డ్ సర్వే చేసి డాక్యుమెంట్ ఉన్న అర్హులకు సమస్య పరిష్కరించి పట్టాలను పంపిణీ చేస్తామని అన్నారు. మిగిలిన 1433 పైగా దరఖాస్తులో ఎక్కువ శాతం సర్వే నెంబర్ విస్తీర్ణం, సర్వే నెంబర్ పాస్ బుక్ లో ఎక్కలేదని దరఖాస్తులు వచ్చాయని, క్షేత్ర స్థాయి ఎంజాయ్ మెంట్ సర్వే చేసి 299 దరఖాస్తులు ఆమోదించామని, ప్రతి తిరస్కరించిన దరఖాస్తుకు కారణం స్పష్టంగా తెలియ జేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు మంజూరు చేసిన 800 పైగా ఇండ్లలో 30 ఇండ్లు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. 200 పైగా లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణం చేపట్టామని అన్నారు. రాబోయే వానాకాలం లోతట్టు ప్రాంతాలలో నీటి నిల్వ ఉండకుండా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టామని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూలి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాలపై పటిష్టమైన విజిలెన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. కోర్టు స్టే తొలగిన వెంటనే సుజాత నగర్ పైలెట్ మండలంలో సాధా బైనామా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు పంపిణీ చేయాలని అన్నారు. ఇంటి నిర్మాణ సామాగ్రి తక్కువ ధరకు పేదలకు అందించాలని అన్నారు. జిల్లాలో కొన్ని చోట్ల రైస్ మిల్లుల వద్ద తరుగు పేరుతో ధాన్యం కోత విధిస్తున్నారని , దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని అన్నారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు సజావుగా జరిగిందని, యాసంగి సీజన్ లో కొంత ఇబ్బంది జరిగిందని, వచ్చే సీజన్ లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ గత ప్రభుత్వం లో గృహలక్ష్మి క్రింద బేస్మెంట్ స్థాయి వరకు నిర్మించి డబ్బులు రాకుండా నిలుపుదల అయిన వాటికి ఇల్లు పూర్తి చేసే విధంగా డబ్బులు మంజూరు చేయాలని, సత్తుపల్లి నియోజకవర్గ ప్రాంతంలో వైద్యుల కొరత ఉన్నదని, 100 పడకల ఆసుపత్రికి అనుగుణంగా వైద్యులను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్ రాజ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ లు పి. శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, డిఆర్వో ఏ. పద్మశ్రీ, ఉమ్మడి జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## ఉమ్మడి వరంగల్ కలెక్టర్ల పనితీరుపై మంత్రి పొంగులేటి తీవ్ర అసంతృప్తి

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో నిర్లక్ష్యం తగదన్న మంత్రి**

**జూన్ 6 నాటికి లబ్ధిదారుల జాబితా, ప్రొసీడింగ్స్ కాపీలు సిద్ధం చేయాలని ఆదేశం**

**నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచన**

వరంగల్ **మే29(జర్నలిస్ట్ వార్త):**

ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ల పనితీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రజలకు అత్యంత కీలకమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అనుమతుల మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యం తగదని అన్నారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని, జూన్ 6వ తేదీలోగా అర్హులైన వారి పూర్తి జాబితాను తయారు చేయాలని ఆయన గడువు విధించారు. కేవలం జాబితా మాత్రమే కాకుండా, సంబంధిత ప్రొసీడింగ్స్ కాపీలను కూడా జతచేసి అందించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అదేవిధంగా, వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులను తీవ్రంగా నష్టపరిచే నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడదపై కూడా మంత్రి దృష్టి సారించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు లేదా ఎరువులు విక్రయిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నకిలీ దందాను సమర్థవంతంగా అరికట్టేందుకు పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

---

## దేశ చరిత్రలోనే సాగులో తెలంగాణనంబర్ వన్

**: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**మే29(జర్నలిస్ట్ వార్త):**

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ పండని విధంగా అత్యధికంగా దేశ చరిత్రలోనే తెలంగాణ వరి సాగులో నంబర్ వన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వానాకాలం పంటల సాగు సన్నద్ధతపై కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్సింగ్ ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య చిన్నమైలు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో




ఎస్సారెస్పీ నీటి విడుదల ప్రణాళికలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపి లను భాగస్వామ్యం చేస్తామని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం సిల్ట్ కారణంగా తగ్గిందని, రాష్ట్ర ప్రభుత్వం పాలసీ ప్రకారం ఎస్సారె-స్పీ రిజర్వాయర్ పూడికతీత, డీ సిల్టేషన్ ఆధునిక పద్ధతుల్లో పూర్తి చేసి పూర్వపు సామర్థ్యం తీసుకొని వస్తామని అన్నారు. అదేవిధంగా కడెం ప్రాజెక్టు తో పాటు ఇతర ప్రాజెక్టుల్లో సిల్ట్ తొలగించేందుకు అత్యాధునిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు.

# మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకే డెయిరీ ఏర్పాటు

## -పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

### హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో పరకాల మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాల సమితి మహాజనసభ



**హనుమకొండ/మే29(జర్నలిస్ట్ వార్త):**
పరకాల నియోజకవర్గంలోని మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకే డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.

గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో పరకాల మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాల సమితి మహాజన సభను నిర్వహించారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మహిళా డెయిరీ ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చినప్పటి నుంచి రెండు జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లగా, ప్రారంభం నుండి అంచనాకు మించి కలెక్టర్లు కోఆర్డినేట్ చేస్తున్నారని అన్నారు. మహిళా డెయిరీ ఏర్పాటుకు కృషి చేస్తున్న రెండు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులకు అభినందనలు తెలిపారు. మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడం ద్వారా ఆ కుటుంబాలు ముందుకెళ్తాయన్నారు. మహిళలు ఐక్యమత్యంగా ఉండి అనేక రంగాలలో విజయవంతంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. మహిళలు పరస్పర సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్న ములుకనూరు మహిళా డెయిరీ మహిళా శక్తికి నిదర్శనం అని పేర్కొన్నారు. ములుకనూరు డెయిరీ మాదిరిగానే పరకాల మహిళా డెయిరీ కూడా రానున్న రోజుల్లో విజయవంతంగా నడవాలన్నారు. మహిళా డెయిరీ ఏర్పాటుతో మహిళలు అభివృద్ధి సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పరకాల మహిళ పాల డెయిరీ ని విజయవంతంగా నిర్వహిస్తూ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు కూడా మార్గదర్శకంగా నిలవాలన్నారు. మహిళలు తమను తాము నిరూపించుకోవడానికి ఇదొక మంచి అవకాశం అని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించిందుకే డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డెయిరీ ఏర్పాటు ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని నమ్మకం పెట్టుకున్నామని అన్నారు. పాల డెయిరీ నిర్వహణకు పట్టుదలతో పని చేసి స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. ములుకనూర్ మాదిరిగా పరకాల మహిళా డెయిరీ విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదన్నారు. తపన, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. డెయిరీ ఏర్పాటుకు జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ(ఎన్డిడి) సహకారం ఉంటుందన్నారు. అధికారులు అండగా ఉంటారని, మహిళలు ధైర్యంగా ముందుకెళ్లాలన్నారు.

వారం రోజుల్లో కమిటీని ఏర్పాటు కావాలని సూచించారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విజయవంతంగా శిక్షణను పొందాలని అన్నారు. డెయిరీ నిర్వహణలో ప్రారంభంలో కొంత కష్టం ఉంటుందని, హార్డ్ వర్క్ చేసి డెయిరీని విజయవంతంగా నిర్వహించాలన్నారు. డెయిరీని విజయవంతంగా నిర్వహించేందుకు సమర్థవంతమైన లీడర్లను ఎన్నుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే రుణాలను డెయిరీ సంబంధిత యూనిట్లకు ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. పాల ఉత్పత్తి రంగానికి అనుబంధంగా ఉన్న రంగాలను కూడా ఎంచుకోవాలన్నారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక విజన్ తో మహిళలు అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పాల డెయిరీ నిర్వహణను మహిళలు ఛాలెంజ్ గా తీసుకోవాలని అన్నారు. మహిళలు క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పరకాల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మహిళలు మాట్లాడుతూ ఇటీవల ములుకనూరు పాల డెయిరీ ని సందర్శించామని, అక్కడ డెయిరీ నిర్వహణ, పాల సేకరణ, అభివృద్ధిపథంలో సాగుతున్న డెయిరీ గురించిన ఎన్నో విషయాలు తెలుసుకుని స్ఫూర్తిని పొందామని పేర్కొన్నారు. మహిళల ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా విజయపథంలో కొనసాగుతున్న ములుకనూర్ డెయిరీ మాదిరిగానే కొత్తగా ఏర్పడుతున్న పరకాల మహిళా పాల ఉత్పత్తిదారుల సమితిని ముందుకు తీసుకెళ్తామని పరకాల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మహిళలు పేర్కొన్నారు. పరకాల మహిళా డెయిరీ ఏర్పాటు కు ప్రత్యేక చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ వరంగల్ జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు మేన శ్రీను, కౌసల్య దేవి, నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ అధికారులు లత, సుందర్ రావు, ఇతర అధికారులతో పాటు పరకాల మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాల సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుడిసె వాసులకు ఇంటి స్థలాలు, పట్టాలు ఇచ్చి

# ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి



**హనుమకొండ/గుండ్ల సింగారం:మే29(జర్నలిస్ట్ వార్త):** నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి స్థలాలు, పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. గురువారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల కేంద్రం వద్ద గుడిసె వాసుల సమావేశం సిపిఐ హనుమకొండ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి హాజరై మాట్లాడుతూ ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిని సదానందం, నాయకులు పోనుగోటి రాంగోపాల్ చారీ, కట్కూరి కృష్ణ, హరిక్రిష్ణ, మాలోత్ మంగ, నరేందర్, గుంటి రజిత, రానా, దామోదర్ గుడిసె వాసులు తదితరులు పాల్గొన్నారు.

# యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్

### చెన్నైలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు



చెన్నై, **మే29(జర్నలిస్ట్ వార్త)::**యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. చెన్నై విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలే సన్నీ యాదవ్ బైక్‌పై పాకిస్థాన్ వెళ్లి వచ్చాడు. దీంతో పాకిస్థాన్ పర్యటనకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పాకిస్థాన్‌లో ఎవరితోనైనా సంబంధాలు కలిగి ఉన్నాడా? ఎలాంటి గూఢచర్యం చేశాడన్న విషయాలపై ఆరా తీస్తున్నారు.ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన జ్యోతి మల్హోత్రాతో సహా పలువురిని జాతీయ దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జ్యోతి మల్హోత్రా.. పాకిస్థాన్ అధికారులతో చాలా క్లోజ్‌గా తిరిగింది. పాకిస్థాన్ ఐఎస్ఐతో కూడా మంచి సంబంధాలు ఉన్నట్లు-గా గుర్తించారు. ఇక జ్యోతి మల్హోత్రాకు సంబంధించిన యూట్యూబ్‌లో పాకిస్థాన్‌కు సంబంధించిన అనేక వీడియోలు ఉన్నాయి. ఆమె పాకిస్థాన్‌కు మూడు సార్లు వెళ్లి వచ్చింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడికి ముందు కూడా జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌కు వెళ్లినట్లు-గా గుర్తించినట్లు- సమాచారం

## నిరుపేదలను ఆదుకోవడమే

# ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యం





**రాయపర్తి/మే29(జర్నలిస్ట్ వార్త):** నిరుపేదలను ఆదుకోవడం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా కుల రంగారెడ్డి అన్నారు.మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చిర్ర సాయులు,ఎండీ చెత్తమ్మ, బోయిని కొమురయ్య, శివరామపురం గ్రామానికి చెందిన సోమనర్సయ్య ఇటీవల అనారోగ్యలతో మరణించగా గురువారం మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపల్లి సంతోష్ గౌడ్,పరుపాటి రవీందర్ రెడ్డి, గబ్బేట కొమురయ్య, సంకినేని ఎల్లస్వామి, గాడిపెల్లి రాములు, బాధ రవి, బోయిని పెద్దులు, చిర్ర దర్గయ్య, తాటికాయల ఐలయ్య,చెడుపాక కుమార్,పసునూరి యాకుబ్ రెడ్డి,చెడుపాక ఎల్లయ్య,చెడుపాక యాకయ్య, తాళ్లపల్లి సాయిలు, చిన్నవీరయ్య, బందు యాకయ్య, చెడుపాక అంజియ్య, రాంనర్సయ్య యాకయ్య, రవి, యాకయ్య, చిలుముల మ్సల్లయ్య, సాంబయ్య,గారే ప్రశాంత్, రాజబాబు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం



**రాయపర్తి/మే29(జర్నలిస్ట్ వార్త):** క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని డివైస్ ఓ సత్యవాణి అన్నారు. గురువారం మండలంలోని తిరుమలాయపల్లి గ్రామంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో గ్రామ ఇన్చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వార్షిక వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కూడా విద్యార్థిని,విద్యార్థులు క్రీడలపై ఎంతో ఉత్సాహాన్ని చూపెడుతున్నారని అన్నారు.క్రీడలతో స్నేహ భావం పెరుగుతుందని అన్నారు.శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందని,ఈ భవిష్యత్తులో ఉపయోగపడతాయని అన్నారు.

# టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిపై సమీక్ష

**వరంగల్/మే29(జర్నలిస్ట్ వార్త):**
జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ధరణికాంత్ డైరెక్టర్ ఆఫ్ టెక్స్టైల్ తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారధ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిలో భాగంగా సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశానికి కే ఎం పి టీ జోనల్ మేనేజర్ తో పాటు హార్టికల్చర్, ఫారెస్ట్, డి ఆర్ డి ఓ , జిఎం ఇండస్ట్రియల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఎలక్ట్రిసిటీ శాఖల, ఉపాధి కల్పన శాఖ అధికారులతో పాటు కిటెక్స్ యంగ్ వన్ గణేష్ ఎకోటెక్ పరిశ్రమల యజమాన్యంతో సమీక్ష నిర్వహించి ఆయా శాఖలు చేయవలసిన పనులపై రివ్యూ నిర్వహించడమైనది.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి, ఉద్యోగ అవకాశాల సృష్టికి, మరియు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇది టెక్స్టైల్ రంగంలో సమగ్ర మౌలిక సదుపాయాలను అందించడంతో పాటు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కూడా



ముందుంది. ప్రభుత్వం, పరిశ్రమలు, మరియు స్థానిక వృత్తిదారుల సహకారంతో ఈ పార్క్ దేశంలో మోడల్ టెక్స్టైల్ పార్క్‌గా గుర్తింపు పొందుటకు కృషి చేయాలని అన్నారు.సంబంధిత శాఖల అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ గ్రీన్ కవర్ ఏర్పాటుకు ఫారెస్ట్, హార్టికల్చర్ అధికారులు కో ఆర్డినేషన్ తో త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డి ఆర్ డి ఏ నుండి మహిళలకు టైలరింగ్ ట్రైనింగ్ నిర్వహించడం జరిగిందని మొత్తం 6 బ్యాచ్ లుగా తయారు చేసి ఇప్పటివరకు నాలుగు బ్యాచ్ లకు ట్రైనింగ్ పూర్తయిందని, ఇంకాను రెండు బ్యాచ్ లకు ట్రైనింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

కాకతీయ టెక్స్టైల్ పార్కులో భూమి కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాల కూడా లేఅవుట్ అనుమతులు మరియు మౌలిక సౌకర్యాలు కల్పించుటకు జోనల్ మేనేజర్ గారిని ఆదేశించడమైనది. అనంతరం కూడా అనుమతులు అనంతరము రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించుటకు సంబంధిత తాసిల్దార్ మరియు జోనల్ మేనేజర్ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించడమైనది.డైరెక్టర్ ఆఫ్ టెక్స్ టైల్ ధరణి కాంత్ మాట్లాడుతూ ఈ కాకతీయ మెగా టెక్స్టైల్ ఇండస్ట్రియల్ లో ఎలాంటి ఉపాధి కల్పించవచ్చు అవి ఎలాంటి అర్హతలు కలిగి ఉండాలి అనే దానిపైన అవేర్నెస్ అవసరం అని అట్టి పోస్ట్ ల నియామకం చేయుటకు లోకల్ నిరుద్యోగ యువతకు ట్రైనింగ్ ఇచ్చినట్లయితే నిరుద్యోగము సమస్యను కొంతవరకు నిర్మూలించగలరని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కే ఎంపిటి జోనల్ మేనేజర్ స్వామి గీసుకొండ తాసిల్దార్ రియాజుద్దీన్, సంగం తాసిల్దార్ రాజ్ కుమార్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాల్లో అదనపు రుసుములు తీసుకుంటే చర్యలు తీసుకుంటాం

## - ఈడీఎం శ్రీకాంత్

**గణపురం/మే29(జర్నలిస్ట్ వార్త):** మీసేవ కేంద్రాల్లో అదనపు రుసుములు తీసుకుంటే చర్యలు తీసుకుంటాంమని ఈడీఎం శ్రీకాంత్ అన్నారు.

గురువారం రేగొండ, గణపురం మండల కేంద్రాల్లోని మీ సేవా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేవల అందుబాటు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు.ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే సంబంధిత అధికారులను సంప్రదించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు అంతరాయం లేకుండా సేవలు అందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన




సేవలందించడమే మీ సేవా కేంద్రాల కర్తవ్యమని తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా అందించు సేవలకు సంబంధించి ధరల పట్టిక ఏర్పాటు చేయాలని మీ సేవా కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా మీ సేవా కేంద్రాల పౌరులకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు.



# కల్లూరు మండలం ముచ్చారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**కల్లూరు/మే29(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలో ముచ్చారం రైతు వేదిక లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమన్ని కృషి విజ్ఞాన కేంద్రం వైరా మరియు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ ఖమ్మం జిల్లా వారి సహకారం తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. కే. రవి కుమార్ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడండి సాగు ఖర్చును తగ్గించండి అవసరం మేరకు రసాయనాల ను వినియోగించండి - నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని తెలిపారు. డా. వి. చైతన్య ఉద్యాన శాస్త్రవేత్త సాగు నీటిని ఆదా చేయాలని బావితరాలకు సాగు నీటిని అందించడం మరియు చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చు అని



వివరించారు.పంట మార్పిడిని పాటించండి - సుస్థిర ఆదాయాన్ని పొందండి. పంట సాగు నిమిత్తం విత్తనాలు కొన్న రసిదులను భద్రపరచండి కష్టకాలం లో నష్ట పరిహారాన్ని పొందండి అనే అంశాలపై పి ఎస్ ఎం ఫణిశ్రీ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో ఉద్యాన అధికారి నగేష్ మాట్లాడుతూ రైతులకు పామాయిల్ సాగు పైన ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకం, సబ్సిడీ గురించి మిరప మామిడి పత్తి కూరగాయలు పంటలు వేసే రైతులకు డ్రిప్ పరికరాలు సబ్సిడీ పద్దతిలో అందిస్తున్నట్లు రైతులు కూరగాయల పంటల సాగు వైపు మొగ్గు చూపాలని ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహకల గురించి వివరించారు.అధిక సంఖ్య లో ముచ్చారం క్లస్టర్ రైతులు పాల్గొని వారి సమస్యలకు, సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి సమాధానాలను తెలుసు కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పవన్, వెంకట లీల, సందీప్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రాజమ్మ కుంట ఆక్రమం

### -ఇరిగేషన్ ఈ ఈ బసవప్రసాద్

**గణపురం/మే29(జర్నలిస్ట్ వార్త):** గణపురం మండలం నగరంపల్లి శివారు రాజమ్మ కుంట పరిధిలో అక్రమంగా సింగరేణి ఓసి-3 మట్టి డంపింగ్ ను భూపాలపల్లి ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండ సింగరేణి అధికారులు మట్టి పోసి రాజమ్మ కుంటను ధ్వంసం చేస్తున్నారని స్థానిక రైతులతో ఈఈ చర్చించారు. చెరువు కట్టను, మత్తడిని ధ్వంసం అయినట్లు గుర్తించారు. కుంట ధ్వంసంపై సింగరేణి అధికారులను వాకబు చేసే ప్రయత్నం చేశారు.సింగరేణి చర్యలతో 49 ఎకరాల ఆయకట్టును నిర్వీర్యం అయ్యిందన్నారు. నీటి వనరుల ధ్వంసంపై హైకోర్టు లో కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ వెంట గణపురం ఏఈలు సమ్మరావు, మహేందర్, నగరంపల్లి రైతులు ఉన్నారు.





# ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి.

### -ఎమ్మెల్యే కు టి.ఎస్.జే.యూ వినతి

**భూపాలపల్లి/మే29(జర్నలిస్ట్ వార్త):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా:కేంద్రంలో ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించి,భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్.యూ.జే.ఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా ప్రధానకార్యదర్శి



దొమ్మటి రవిలు గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి.ఎస్.జే.యూ నేతలు మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏర్పాటు నుండి జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ లేక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా, విద్యార్థి,కార్మిక,కర్షకులు,వివిధ యూనియన్లు,బాధితప్రజలు మీడియా ద్వార తమ సమస్యలు తెలియజేయుటకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడిందని,దీంతో చెట్లకింద ప్రెస్ మీట్ లు నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారని ప్రెస్ క్లబ్ కు స్థలం,భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ను కోరగా వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవిందర్,మహమ్మద్ వలి,సంయుక్త కార్యదర్శి కడపాక రవి,తాళ్ల పెల్లి సమ్మయ్య,రడపాక రమేష్,రాచర్ల సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

# టీ స్టాల్ ను సందర్శించిన సత్తుపల్లి ఎమ్మెల్యే శ్రీమతి మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్



**తల్లాడ/మే29(జర్నలిస్ట్ వార్త):** స్థానిక తల్లాడ పట్టణం నందు కల్లూరు రూట్ లో గల ఎమ్మార్వో ఆఫీస్ ముందుగల మహిళా శ్రీ శక్తి డ్వాక్రా రుణాల ద్వారా మంజూరైన దేవహోత్రేయ శ్రీ టీ స్టాల్ ని సందర్శించి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో సరదాగా టీ తాగిన సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ , దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి రమేష్, తల్లాడ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దుగ్గిదేవర రవీంద్ర కోడూరు రాము, బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఐదేళ్ల చిన్నారి ప్రాణాలు తీసిన పిచ్చికుక్క

**భద్రాద్రి కొత్తగూడెం / మే29 (జర్నలిస్ట్ వార్త):** మిస్ వరల్డ్ పోటీదారుల జాగ్రత్త కోసం తీసుకున్న చర్యలు సామాన్య ప్రజల జాగ్రత కోసం ఉండవా అంటూ నిలదీస్తున్న ప్రజలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి



చెందిన బానోత్ రమేష్, స్వప్న దంపతుల కుమార్తె నిహారిక గాయత్రి (5) మే 13వ తేదీన ఇంటి ముందు ఆడుకుంటుండగా చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసింది.కొత్తగూడెంలోని ఆసుపత్రికి తరలించగా వైద్యులు వ్యాక్సిన్ చేసి పంపారు.ఈ నెల 25వ తేదీన చిన్నారి వింతగా ప్రవర్తించడం, నోటినుండి నురుగు రావడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తల్లిదండ్రులు.తరలించారు.పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ లోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడు కుటుంబం సభ్యులు శోక సముద్రం లో మునిగిపోయారు.

# ఎస్సై కొండల్ రావు కి ఘన సన్మానం

**తల్లాడ/మే29(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ శ్రీ కొండల్ రావు బదిలీ అవుతున్న సందర్భాగా గురువారం స్థానికంగా ఒక ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కొండల్ రావు గత కొంతకాలంగా తల్లాడ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం, భద్రత అందించడంలో అత్యుత్తమ సేవలు అందించారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పెద్దలు, స్థానికులు ఆయన సేవలను కొనియాడారు. ప్రజలతో సానుభూతిగా



వ్యవహరించే నైపుణ్యం, సమస్యలపై గమనించే నిశిత దృష్టి ఆయనను ప్రజల మన్ననలు పొందే అధికారిగా నిలిపింది.ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఓబుల సీతారామరెడ్డి కొండల్ రావు కి శాలువా కప్పి, స్వీట్ తినిపించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. బండి బాలశౌరి ఉన్నారు

# విద్యరంగ అభివృద్ధికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృషి

### -యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్

**పర్వతగిరి/మే29 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విశిష్ట కృషి చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ అన్నారు.గురువారం పర్వతగిరి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నియోజకవర్గ అభివృద్ధి పట్ల విద్యారంగ అభివృద్ధి పట్ల పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీద విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన ఉచిత విద్యను అందించడం కోసం తెలంగాణ రాష్ట్ర సర్కార్ వర్ధన్నపేట నియోజకవర్గనికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం



పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీని నిర్మాణం కోసం 200 కోట్ల రూపాయల నిధులకు సంబంధించిన జీవో రాష్ట్ర సర్కార్ ఇటీవల జారీ చేయడం జరిగిందన్నారు. ఈ స్కూల్లో నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సకల సౌకర్యాలతో విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ స్కూల్లో సుమారు 2000 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏసిటీ కేంద్రాన్ని మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే నాగరాజు కు యూత్ కాంగ్రెస్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉద్యమకారుడికి నివాళులర్పించిన వీరారెడ్డి





**తల్లాడ/మే29(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పాత పినపాక గ్రామస్తులు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు మోదుగు ఆశీర్వాదం గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పినపాక గ్రామంలో వారి నివాసం వద్ద తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోవడం జరిగింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా కుటుంబ సభ్యులకు పాగాడ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరా రెడ్డి , కేతేపల్లి భాస్కర్ ,యుగంధర్ ఎస్.కె వార్త విలేకర్ బహదూర్ , బహుజన సేవ సంగం అధ్యక్షులు నారపోగు ప్రసాద్, విసునపల్లి వెంకట్ ,తేలపోట్ల నారాయణ , ఘనమైన నివాళులర్పించారు.

# మార్కింగ్ ల తోనే సరి..
# కూల్చివేతలు ఎప్పుడో మరి..?

### -దర్జాగా ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు -మార్కింగ్ లు పెట్టి వదిలేస్తున్న అధికారులు
### -ఏళ్లు గడుస్తున్న కూల్చివేతల దిశగా అడుగు వేయని వైనం

**పర్వతగిరి/మే29(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ స్థలంలో దర్జాగా అక్రమ కట్టడాలు నిర్మించి వినియోగిస్తున్నా వాటి కూల్చివేత దిశగా ప్రభుత్వం, అధికారులు అడుగులు వేయడం లేదు. అక్రమ కట్టడాలు నిర్మించింది ప్రభుత్వ స్థలంలోనే అని తెలిసినా అధికారులు మాత్రం కూల్చివేత దిశగా కాలు కదపడం లేదు. గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే ఆక్రమించినంత వరకు నామమాత్రంగా మార్కింగ్ లు పెట్టి వదిలేస్తున్నారు. అక్రమ కట్టడాలను కూల్చివేయాల్సిన బాధ్యత ఏ శాఖ అధికారులకు కిందికి వస్తుందో ఎవరు నోరు మెదపడం లేదు. పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ శాఖ చోద్యం చూస్తూ ఉండిపోయాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్ దర్గా ఎదురుగా ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనిపై పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు సర్వే చేసి కొలతలను నిర్ధారించారు. ప్రభుత్వ స్థలంలో చొచ్చుకొని వచ్చి నిర్మాణాలు జరిపిన విషయం వాస్తవమేనని తేలింది. దీంతో ఆక్రమించిన మేర మార్కింగ్ వేశారు. మార్కింగ్ వేసి ఏళ్ళు గడుస్తున్న నేటికీ కూల్చివేయడం లేదు. కూల్చివేతల జోలికి వెళ్ళకపోవడంతో ప్రభుత్వ పెద్దలను, అధికారులను ఆక్రమణదారులు మేనేజ్ చేస్తున్నారని వదంతులు వ్యాపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగి అక్రమ కట్టడాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని పలువురు గ్రామస్తులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



# సీఎం రేవంత్,ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం




**రాయపర్తి/మే29(జర్నలిస్ట్ వార్త):**పాలకుర్తి నియోజక వర్గానికి 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను మంజూరు చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి చిత్రపటాలకు గురువారం మండల కేంద్రంలోని బస్ స్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాతిత్ హమ్యా నాయక్ తో కలసి పాలాభిషేకం చేసారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి రెండు వందల కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషి ఫలితంగానే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ స్కూలు మంజూరు చేసినట్లు తెలిపారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో గ్రామీణ పేద గ్రామీణ నిరుపేద విద్యార్థులకు సైతం నాణ్యతమైన విద్య అందించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బొమ్మెర కళ్యాణ్, కృష్ణమాచార్యులు, మాచర్ల ప్రభాకర్, నంగు నూరి అశోక్, భూక్య సమ్మయ్య, ఎసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,ఎండీ ఆఫ్రోజ్,చిర్ర మల్లయ్య,కుంట రమేష్,ఐరెడ్డి ఎల్లారెడ్డి,చెవ్వ కాశీనాదం,ఎస్ కె రఫీక్,గుగులోత్ యాకుబ్, నేతా వత్ కిషన్,చెడుపాక వెంకట్, పిరాని ప్రవీణ్,బండి రాజేంద్ర ప్రసాద్,ఉబ్బని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మన సినిమా ఫస్ట్ రీల్ ఉత్తమ పుస్తకంగా ఎంపిక



**హైదరాబాద్/మే29(జర్నలిస్ట్ వార్త):** గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డ్స్ లో భాగంగా తెలుగు సినిమా పై శ్రీ రెంటాల జయదేవ రాసిన మన సినిమా ఫస్ట్ రీల్" ఉత్తమ పుస్తకం గా ఎంపిక చేశారు . ఈ ఎంపిక చేసిన నివేదికను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గార్లకు సమర్పించారు. నివేదిక సమర్పించిన జ్యూరీ సభ్యులు శ్రీ భగీరథ, డా.వడ్లమాని ,కనకదుర్గ , మధు వాకిటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు వాకిటి మాట్లాడుతూ జూన్ 14వ తేదీన గద్దర్ నంది అవార్డును ఇస్తున్నట్లుగా తెలిపారు.

# ఎరువులు, పురుగు మందుల షాపులపై ఆకస్మిక తనిఖీలు

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు







**వర్ధన్నపేట/మే29(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలంలో డిస్ట్రిక్ట్ సీడ్ స్క్వాడ్, వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖల సంయుక్త పర్యవేక్షణలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులపై గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా అధికారులు మండలంలోని పలు విత్తన, ఎరువులు, పురుగు మందుల షాపులను సందర్శించి, వాటిలో నాణ్యత ప్రమాణాలు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ ఉత్తణాలు అమ్మకాలు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్, స్టాక్ బోర్డ్ తప్పనిసరిగా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రైతులకు ఇచ్చే ప్రతి విత్తనం, ఎరువు, పురుగు మందులపై ఖచ్చితంగా బిల్ ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయం జరిగిన పక్షంలో విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పిడి యాక్ట్ మోదు చేస్తామని హెచ్చరించారు.అధికారులు రైతులకు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ఎవరికైనా అనుమానాస్పద ఉత్పత్తులు కనిపించినప్పుడు వెంటనే వ్యవసాయ విభాగానికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీలో భాగంగా అనుమానాస్పదంగా కనిపించిన విత్తన ప్యాకెట్లను నిబంధనల ప్రకారం శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపించడం జరిగిందన్నారు.పరీక్షా నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోనున్నామని అధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ నుండి ఏడీఏ విజయ భాస్కర్,అధికారులు రంజిత్, విజయ్ కుమార్ఎస్ఐ చందర్, రాజు లు పాల్గొన్నారు

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూల్ మంజూరుపై హర్షం



**పర్వతగిరి/మే29(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో సీఎం డిప్యూటీ సీఎం ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారాధ్యంలో శాసనసభ్యులు కేఆర్ నాగరాజు నాయకత్వంలో ఇంత పెద్ద స్కూలు 200 కోట్ల రూపాయలతో మంజూరు కావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల పిల్లలను ఏమాత్రం పట్టించుకోలేదని టిఆర్ఎస్ హయంలో కేజీ టు పీజీ విద్యను నాయకులు వాగ్దానాలకే పరిమితమైనది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన మాట నిలుపుకున్న దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందు వెళ్తుందని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఆరు గ్యారెంటీలతోపాటు అనేక సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ,వర్గాలకు అందించే విధంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అనిల్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కుసం రామచందర్, సొసైటీ డైరెక్టర్ గంగాధర్ రావు, సీనియర్ నాయకులు కత్తుల ఐలయ్య, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు నరసయ్య, సీనియర్ నాయకులు సునీల్ రావు,ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్,ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరుకుడు రవీందర్, బోట్ల కనకరాజు, గొడుగు రమేష్,మంగ్యా నాయక్, వెంకన్న, పంతు నాయక్, నరెడ్ల సమ్మయ్య, చీదురు మల్లేష్, సిరుకొండ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి పట్టణం వార్డు లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి





**సత్తుపల్లి/మే29(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి పట్టణం మరియు రాజీవ్ కాలని తో పాటు వార్డు లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సత్తుపల్లి మండలం బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహారావు నీ కలసి వినతిపత్రం అందజేశారు.ఫుటపాత్ ఆక్రమణ దారులను షాపు లను తొలగించాలని, అదేవిధంగా రోడ్డు లను, ఫుట్ పాత్ లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్న వారు అందరకి నోటీసు లు ఇచ్చి తొలగించాలని, నోటీసు లు విషయం లో అందర్నీ ఒకే విధం గా చూడాలని కోరారు. కొన్ని వార్డు లలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, వచ్చే సీజన్ వర్షాకాలం కనుక పరిసరాలు పరిశుభ్రత పాటించేలా చూడాలని, ఖాళీ ప్రదేశాలలో పెరుగుచున్న చెట్లను, ఖాళీ ప్లాట్ లో చెత్త, పిచ్చిమొక్కలు పెరుగుచున్నాయి కనుక ఆ ప్లాట్ ల యజమానులకు తెలియజేసి శు భ్రం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా,సత్తుపల్లి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరం రాజు,విజయ్,శివకృష్ణ, మట్టా ప్రసాద్, జొన్నలగడ్డ నరేష్, మెరుగు శేషగిరి, మంద శివ తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా

## రాష్ట్రం పునర్నిర్మాణమే లక్ష్యం

### కడప మహానాడులో చంద్రబాబు ఉద్వేగ పూరిత ప్రసంగం









- ఒక్కో ఇటుక పేరుస్తూ వస్తున్నాం
- సంపద సృష్టించడమే తెలుగుదేశం పార్టీ విధానం
- గొడ్డలిపోటు రాజకీయాలకు టిడిపి దూరం
- కష్టాలు చూసి బెదిరలేదు.. సవాళ్లకు పారిపోలేదు.
- ఉగ్రవాదులనే కాదు..ఆర్థిక ఉగ్రవాదులను తరిమి కొట్టాల్సిందే
- రాజకీయాల ముసుగులో ల్యాండ్, శాండ్, మైన్స్ దోపిడీ
- డ్రగ్స్, గంజాయి అమ్మితే అదే చివరి రోజు
- ఆడబిడ్డల జోలికి వస్తే అవే వారికి అంతిమ ఘడియలు
- కలసికట్టుగా సాగితే వైకాపా మటుమాయం తప్పదు

కడప, **మే29(జర్నలిస్ట్ వార్త):** విధ్వంసానికి గురైన రాష్ట్రం పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఒక్కో ఇటుక పేరుస్తూ పునర్నిర్మాణానికి అంకితమై పనిచేస్తున్నామని తెలుగుదేశం అధినేత, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వైనాట్ గొడ్డలిపోట్లు అనేవి మన విధానం కాదు. ప్రతిక్షణం కష్టపడి పనిచేయడం మన విధానం. కష్టాలు చూసి బెదిరిపోలేదు.. సవాళ్లు చూసి పారిపోలేదు. క్లైమోర్ మైన్లకే భయపడలేదు.. సమస్యలకు భయపడతానా అంటూ వ్యాఖ్యానించారు. ఇటుక, ఇటుక పేర్చుతూ విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం నా జీవిత ఆశయం. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెలుగుదేశం పార్టీ. నా కష్టం నాకోసం కాదు.. నన్ను నమ్మిన జనం కోసం పాటుపడుతున్నానని అన్నారు. మూడ్రోజుల కడప మహానాడు ముగింపు సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. దేశానికి ఉగ్రవాదుల వల్ల చాలా నష్టం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదుల వల్ల కూడా అంతే నష్టం. ఆర్థిక ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాం. రాజకీయాల ముసుగులో ల్యాండ్, శాండ్, మైన్స్ దోచేశారు. డ్రగ్స్, గంజాయి అమ్మితే అదే చివరి రోజని హెచ్చరిస్తున్నా. ఆడబిడ్డల జోలికి వస్తే అవే వారికి అంతిమ ఘడియలు అని హెచ్చరించారు. మనం కలిసికట్టుగా ఉంటే.. వైకాపా అడ్రస్సే ఉండదని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవుని గడపలో తొలి మహానాడు సూపర్ హిట్ అయిందని చంద్రబాబు అన్నారు. కడప..తెలుగుదేశం పార్టీ అడ్డా అన్నారు. అది నిరూపించేందుకే ఇక్కడ మహానాడు నిర్వహించామన్నారు. అన్ని దారులు కడపవైపే ఉన్నాయి.. పార్టీ శ్రేణులతో కడప దిగ్బంధమైంది. కడప గడపలో మార్పు కనిపిస్తోంది. అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు. వైకాపాకు రాయలసీమలో 7 సీట్లు వస్తే.. కడప జిల్లాలోనే కూటమి 7 గెలిచింది. 2029 ఎన్నికల్లో ఉమ్మడి కడపలో పదికి పది స్థానాలు గెలవాలి. తెదేపా కార్యకర్తలే నా బలం, బలగం. మొన్నటి విజయం వెనుక కార్యకర్తల పోరాటం, త్యాగం, కష్టం ఉంది. గత పాలనలో హింసా రాజకీయాలు, కేసులు, అణచివేతలు రాజ్యమేలాయి. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిస్తామని తెదేపా, జనసేన, భాజపా కూటమి ఏర్పాటు- చేసి ప్రజలముందుకొచ్చాం. 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో అదిరిపోయే విజయం సాధించాం అని వివరించారు.అహంకారంతో విర్రవీగే వారికి కడప జిల్లా ప్రజలు బుద్ధి చెప్పారు.. 2029లో పదికి పది సీట్లు సాధించడానికి మీరు సిద్ధమా.. సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు.. రాయలసీమలో వైసీపీకి ఏడు సీట్లు- వస్తే, కూటమికి అధిక సీట్లు- వచ్చాయి.. ఓడిపోయిన పార్టీ ఇప్పటికీ అర్థం చేసుకోలేదు అర్థం చేసుకోదు కూడా.. ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి పుట్టిన పార్టీ టీడీపీ.. ప్రపంచంలోనే ఒక కేస్ స్టడీ వైసీపీ అని చంద్రబాబు మండిపడ్డారు. ఇక, ఎన్నికల్లో గెలుపులు ఓటములు కొత్త కాదు.. కార్యకర్తలే నా బలం బలగం అని సీఎం చంద్రబాబు అన్నారు.



## బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటంతోనే

# బౌలింగ్ ఎంచుకున్నా

### ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పటీదార్

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న క్వాలిఫయర్-1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ అన్నాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. పిచ్ చూడటానికి చాలా కఠినంగా కనిపిస్తోంది. పిచ్ పూర్తిగా గడ్డితో కవర్ చేసింది ఉంది. వీలైనంత వరకు ఆరంభ ఓవర్లలోనే ఈ అడ్వాంటేజ్‌ను వాడుకోవడానికి ప్రయత్నిస్తాం. గత మ్యాచ్‌లో ప్రతీ ఒక్కరు 100 శాతం కంటే ఎక్కువ ఎఫర్ట్ పెట్టారు. జితేశ్, సాల్ట్, కోహ్లీ అసాధారణ ప్రదర్శన కనబర్చారు. తుది జట్టులో ఒక మార్పు చేశాం. నువాన్ తుషారా స్థానంలో హాజెల్ వుడ్ తిరిగొచ్చాడు.'అని రజత్ పటీదార్ చెప్పుకొచ్చాడు.మరోవైపు టాస్ గెలిచినా తాము ముందుగా బ్యాటింగ్ చేసేవాళ్లమని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. 'మేం ముందుగా బ్యాటింగే చేయాలనుకున్నాం. ఇక్కడి రికార్డ్స్ ముందుగా బ్యాటింగ్ చేసిన జట్లకే అనుకూలంగా ఉన్నాయి. కాబట్టి మాకు విజయం దక్కుతుందనే ఆశతో ఉన్నాను. ప్రేక్షకుల నుంచి మద్దతు అవసరం. వారి అరుపులు మాకు శక్తినిస్తాయి. మా ఓపెనర్ల ఫియర్‌లెస్ గేమ్ అద్భుతం. మార్కో జాన్సెన్ స్థానంలో అజ్మతుల్లా ఆడుతున్నాడు.'అని శ్రేయస్ అయ్యర్ తెలిపాడు.తుది జట్లు:పంజాబ్ కింగ్స్: ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, జోష్ ఇంగ్లిస్(కీపర్), శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), నెహాల్ వధేరా, శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్, హర్‌ప్రీత్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, కైల్ జేమీసన్ఆర్‌సీబీ: విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్, రజత్ పాటిదార్(కెప్టెన్), లియామ్ లివింగ్‌స్టోన్, జితేష్ శర్మ(కీపర్), రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, యష్ దయాల్, జోష్ హేజిల్‌వుడ్, సుయాష్ శర్మ.

# శ్రేయస్ కు తీవ్ర అన్యాయం

### మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్



ఇంగ్లాండ్ పర్యటన కోసం ఎంపిక చేసిన భారత జట్టుపై పలు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొంతమంది ప్లేయర్లను ఎంపిక చేయకపోవడం, సర్ప్రైజింగ్ గా మరికొంతమందిని ఎంపిక చేయడం విచిత్రంగా ఉంది. అసలు ఆటగాళ్లను ఇంత ముఖ్యమైన పర్యటనకు ఏ బేస్ పై ఎంపిక చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా అటు దేశవాళీల్లోనూ, ఇటు వన్డేల్లో, ఐపీఎల్లో చక్కగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్ ను పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అసంతృప్తి వ్యకతం చేశాడు. అన్ని ఫార్మాట్లలో శ్రేయస్ బాగా ఆడుతున్నాడని, అలాంటి ఆటగాడిని పక్కన పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నాడు. ఇక ఏ గణాంకాలు తీసుకుని శ్రేయస్ ను పక్కన పెట్టారని అడుగుతున్నాడు. అదే సమయంలో జట్టులోకి నూతనంగా ఎంపికైన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయి సుదర్శన్ పై చర్చను లేవనెత్తాడు. నిజానికి సుదర్శన్ చాలా మంచి ఆటగాడని, ఐపీఎల్లో సత్తా చాటి ఆరెంజ్ క్యాప్ ను సొంతం చేసుకున్నాడని కైఫ్ గుర్తు చేశాడు. కేవలం ఐపీఎల్ ప్రదర్శననే ఇంగ్లాండ్ టూరుకు గీటురాయిగా తీసుకోవద్దని, అతని రెడ్ బాల్ ఫార్మాట్ ప్రదర్శనను కూడా చూడాలని హితవు పలికాడు. ఒకవేళ ఐపీఎల్ ప్రదర్శనే గీటురాయి అనుకుంటే శ్రేయస్ కూడా బాగా రాణించాడని, అటు పంజాబ్ కెప్టెన్ గా వ్యవహరించి, 11 ఏళ్ల తర్వాత ప్లే ఆఫ్స్ కు తీసుకొచ్చిన విషయాన్ని స్పష్టం చేశాడు. అసలు సెలెక్టర్లు ఏ బేసిస్ పై ఆటగాళ్లను ఎంపిక చేస్తున్నారని ప్రశ్నించాడు. బీసీసీఐ, సెలెక్టర్లు ద్వంద్వ వైఖరితో నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టాడు.ఇక 11 ఏళ్ల తర్వాత ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కు క్వాలిఫై అవడంపై పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయస్ అనందం వ్యక్తం చేశాడు. ముఖ్యంగా హెడ్ కోచ్ రికీ పాంటింగ్ తనకు కావాల్సినంత ఫ్రీడమ్ ఇవ్వడంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నాడు. నిర్ణయాలను సొంతంగా తీసుకునే స్వేచ్ఛను ఇచ్చాడని, దీంతో తను చాలా ఫ్రీగా పని చేశానని పేర్కొన్నాడు. మరోవైపు ఈ సీజన్ లో అదరగొట్టిన పంజాబ్.. 9 విజయాలతో ఓవరాల్ గా 19 పాయింట్లతో లీగ్ టేబుల్లో టాప్ లో నిలిచింది. దీంతో క్వాలిఫయర్ 1కు అర్హత సాధించింది. గురువారం జరిగే క్వాలిఫయర్ 1లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ చేరగా.. మరో జట్టు క్వాలిఫయర్ 2 ఆడుతుంది. ఇక ఎలిమినేటర్ మ్యాచ్ లో భాగంగా ఈనెల 30న ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్ లో ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుండగా, గెలిచిన జట్టు క్వాలిఫయర్ 2 ఆడుతుంది. ఇక ప్లే ఆఫ్స్ కు చేరిన నాలుగు జట్లలో ముంబై ఇండియన్స్ ఐదుసార్ల చాంపియన్ గా నిలవగా, గుజరాత్ టైటాన్స్ ఒక్కసారి టైటిల్ కొట్టింది. మూడుసార్లు ఆర్సీబీ, ఒక్కసారి పంజాబ్ కింగ్స్ రన్నరప్ తోనే సరిపెట్టు కున్నాయి.

# ఫైనల్లో బెంగళూరు

**8 వికెట్ల తేడాతో ఘనవిజయం**

**101 రన్స్‌కే పంజాబ్ ఆలౌట్**

**చెలరేగిన బౌలర్లు**

**సాల్ట్ అజేయ అర్ధసెంచరీ**

ముల్లన్‌పూర్: 'ఈ సాల కప్ నమ్దే' అంటూ దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తమ కల నెరవేర్చుకునేందుకు మరో అడుగు దూరంలోనే నిలిచింది. గురువారం టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌తో జరిగిన క్వాలిఫయర్1లో 8 వికెట్ల తేడాతో ఆర్‌సీబీ ఘనవిజయం సాధించింది. దీంతో తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్లో అడుగు పెట్టింది. 2009, 2011, 2016 సీజన్లలోనూ తుది పోరుకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. అటు ఓడిన పంజాబ్‌కు జూన్1న జరిగే రెండో క్వాలిఫయర్‌లో ఆడే అవకాశముంది. గుజరాత్-ముంబై మ్యాచ్ విజేతతో ఈ పోరు ఉంటుంది. పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన పంజాబ్‌ను ఆర్‌సీబీ బౌలర్లు చెడుగుడు ఆడేయడంతో 14.1 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. స్టొయినిస్ (26), ప్రభ్‌సిమ్రన్ (18), ఒమర్జాయ్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. సుయాష్, హాజెల్‌వుడ్‌లకు మూడేసి.. యష్ దయాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 10 ఓవర్లలో 2 వికెట్లకు 106 పరుగులు చేసి నెగ్గింది. సాల్ట్ (27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 56 నాటౌట్) అర్ధసెంచరీ సాధించాడు.

లీగ్ దశలో అత్యద్భుత ప్రదర్శనతో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు.. ఆ రెండింటి మధ్య క్వాలిఫయర్1 మ్యాచ్ అంటే అభిమానులు ఏ స్థాయిలో ఊహించుకుంటారు? ఈ హోరాహోరీ పోరులో గెలిచి ఫైనల్‌కు వెళ్లే జట్టేదో తెలుసుకునేందుకు అత్యంత ఆసక్తిగానే ఎదురుచూశారు. కానీ ఉత్కంఠభరితంగా సాగాల్సిన ఆట పూర్తి ఏకపక్షమైంది. బెంగళూరు బౌలర్ల ధాటికి బెంబేలెత్తిన పంజాబ్ కనీసం వంద పరుగులు చేసేందుకే ఆపసోపాలు పడింది. ఇక 101 పరుగుల లక్ష్యాన్ని పది ఓవర్లలోనే ముగించిన ఆర్‌సీబీ తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్‌కు చేరింది.





ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సుయాష్ శర్మ నిలిచాడు.

**10 ఓవర్లలోనే..:**

ఇదే వేదికలో కోల్‌కతాపై 111 పరుగుల స్కోరును పంజాబ్ కాపాడుకోగలిగింది. ఈసారి కూడా అలాంటి ఫలితాన్ని రిపీట్ చేస్తుందేమో అని ఆ జట్టు ఫ్యాన్స్ ఆశలు పెట్టుకున్నారు. కానీ మైదానంలో అంత సీన్ కనిపించలేదు. కేవలం 102 పరుగుల ఛేదనే అయినప్పటికీ ఓపెనర్ సాల్ట్ మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. విరాట్ (12) వికెట్‌తో పేసర్ జేమిసన్ నాలుగో ఓవర్‌ను మెయిడిన్‌గా వేశాడు. కానీ సాల్ట్ మాత్రం ఆరంభం నుంచే బ్యాట్‌కు పనిజెప్పాడు. అర్ష్‌దీప్ ఓవర్‌లో 4,6తో పాటు జేమిసన్ ఓవర్‌లో 4,4,4,6తో 21 పరుగులు రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలోనే 61/1 స్కోరుతో సగం కంటే ఎక్కువే లక్ష్యాన్ని పూర్తి చేసింది. అటు మయాంక్ (19) ముషీర్ ఓవర్‌లో 6,4 సాధించి అవుటయ్యాడు. 23 బంతుల్లో సాల్ట్ హాఫ్ సెంచరీ పూర్తయ్యాక..పదో ఓవర్‌లో కెప్టెన్ పటీదార్ (15 నాటౌట్) 4,6తో 14 రన్స్ రాబట్టి మ్యాచ్‌ను ముగించాడు.

తిప్పేసిన సుయాష్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను ఆర్‌సీబీ బౌలర్లు బెంబేలెత్తించారు. భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన చందాన బ్యాటర్లంతా వేగంగా ఆడేందుకు ప్రయత్నించి మూల్యం చెల్లించుకున్నారు. నిర్లక్ష్యపు షాట్లతో చేజేతులా వికెట్లను సమర్పించుకున్నారు. అటు పేసర్లు హాజెల్‌వుడ్, భువీ, యష్‌లతో పాటు స్పిన్నర్ సుయాష్ బ్యాటర్లను ఏమాత్రం కుదురుకోనీయలేదు. ఏకంగా ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు చేరారు. స్టొయినిస్ ఆత్మవిశ్వాసంతోనే కనిపించినా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. రెండో ఓవర్‌లో ఓపెనర్ ప్రియాన్ష్ (7)ను యష్ అవుట్ చేశాక వికెట్ల పతనం ఎక్కడా ఆగలేదు. పవర్‌ప్లే ముగిసేలోపే ప్రభ్‌సిమ్రన్, కెప్టెన్ శ్రేయాస్ (2), ఇన్‌గ్లిస (4) పెవిలియన్‌లో కూర్చున్నారు. అప్పటికి స్కోరు 38/4 మాత్రమే. ఆ తర్వాతైనా జాగ్రత్తగా ఆడతారనుకుంటే మధ్య ఓవర్లలో సుయాష్ సుడులు తిరిగే బంతులకు బలయ్యారు. తొమ్మిదో ఓవర్‌లో తను శశాంక్ (3), అరంగేట్ర బ్యాటర్ ముషీర్ (0)లను అవుట్ చేశాడు. ఇక రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఎదురుదాడికి దిగిన స్టొయినిసను తన తర్వాతి ఓవర్‌లోనే సుయాష్ దెబ్బతీయడంతో పంజాబ్ కనీసం వంద పరుగులైనా చేస్తుందా? అనిపించింది. అయితే ఒమర్జాయ్ పుణ్యమా అంటూ అతికష్టమ్మీద స్కోరు మూడంకెలకు చేరింది. 15వ ఓవర్ తొలి బంతికే ఒమర్జాయ్‌ను హాజెల్‌వుడ్ అవుట్ చేయడంతో పంజాబ్ ఇన్నింగ్స్ మరో 35 బంతులుండగానే ముగిసింది.

# జ్యోతికి స్వర్ణం

**4x 400 రిలేలో తెలుగమ్మాయి కుంజా రజితకు పసిడి**

**స్టీపుల్ చేజ్‌లో సబ్లే అదుర్స్**

**ఆసియా అథ్లెటిక్స్**



గుమి (కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్సమూడోరోజు తెలుగమ్మాయిలు రెండు స్వర్ణాలు సాధించారు. జ్యోతి యర్రాజి మీట్ రికార్డు టైమింగ్‌తో స్వర్ణం నెగ్గగా..రిలేలో కుంజా రజిత పసిడి అందుకుంది. ఇక స్టీపుల్ చేజ్‌లో 36 ఏళ్ల తర్వాత అవినాష్ సబ్లే బంగారు పతకాన్ని అందించాడు. క్రీడలకు మూడో రోజైన గురువారం మూడు స్వర్ణాలు సహా ఆరు పతకాలు సాధించిన భారత్ మొత్తం 14 మెడల్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతోంది. మహిళల 100 మీ. హర్డిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ జ్యోతి 12.96 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచింది. ఈ క్రమంలో 2000లో సూ యిపింగ్ (చైనా) 12.99 సెకన్ల రికార్డును జ్యోతి అధిగమించింది. అంతేకాకుండా ఈ ఈవెంట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకొన్న ఐదో అథ్లెట్‌గా కూడా యర్రాజీ రికార్డులకెక్కింది. తనాక (జపాన్) రజతం, ఉ యన్ని (చైనా) కాంస్యం దక్కించుకొన్నారు. మహిళల 4400 రిలేలో తెలుగమ్మాయి కుంజా రజితతోపాటు జిస్నా మాథ్యూ, రూపల్ చౌధరి, శుభా వెంకటేశన్‌లతో కూడిన భారత బృందం 3 నిమిషాల 34.18 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం నెగ్గగా.. వియత్నాం రజతం, శ్రీలంక కాంస్యం సాధించాయి.



# ఉత్తమ చిత్రంగా ‘కల్కి 2898 ఏడీ’

## తెలంగాణలో ‘గద్దర్ ఫిల్మ్ అవార్డుల’ను ప్రకటించిన ప్రభుత్వం

**గద్దర్ అవార్డులను ప్రకటించిన జయసుధ, దిల్ రాజు... ఉత్తమ నటుడు అల్లు అర్జున్!**

**14 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ సినీ పురస్కారాలు**

**జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు వివరాల వెల్లడి**

**2024 ఉత్తమ చిత్రంగా ‘కల్కి 2898 ఏడీ’ ఎంపిక**

**‘పుష్ప 2’ చిత్రానికిగానూ అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడి పురస్కారం**

**ఎన్టీఆర్, రఘుపతి వెంకయ్య వంటి ప్రముఖుల పేర్లతో ప్రత్యేక అవార్డులు**






తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించనున్న ‘గద్దర్ ఫిల్మ్ అవార్డుల’ను జ్యూరీ ఛైర్‌పర్సన్, ప్రముఖ నటి జయసుధ ప్రకటించారు. గురువారం ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో కలిసి ఆమె మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. సుమారు 14 సంవత్సరాల విరామం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఈ సినిమా పురస్కారాలను ప్రకటించడం గమనార్హం. ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ స్మారకార్థం ఈ అవార్డులకు ఆయన పేరు పెట్టారు. ఈ అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు వచ్చినట్లు జయసుధ తెలిపారు. వీటిని జ్యూరీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి విజేతలను ఎంపిక చేశారని వివరించారు. 2014 జూన్ నుండి 2023 డిసెంబర్ 31 వరకు విడుదలైన చిత్రాలకు సంబంధించి, ప్రతి ఏడాదీ ఒక ఉత్తమ చిత్రానికి అవార్డు ప్రకటిస్తున్నారు. అలాగే, 2014 నుండి 2023 మధ్య సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలను ఇతర కేటగిరీల కింద పరిగణనలోకి తీసుకున్నారు. ఇక 2024 సంవత్సరానికి సంబంధించి అన్ని విభాగాల్లోనూ అవార్డులను ప్రకటించారు. ఈ పురస్కారాల్లో తెలుగు చిత్రాలతో పాటు ఉర్దూ సినిమాలకు కూడా ప్రాధాన్యత కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటీనటులతో పాటు మొత్తం 21 మందికి వ్యక్తిగత, స్పెషల్ జ్యూరీ అవార్డులను అందించనున్నారు. వీటితో పాటు తెలుగు సినిమాకు సేవలందించిన లెజెండ్స్ గౌరవార్థం ఎన్టీఆర్, పైడి జయరాజ్, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి-చక్రపాణి, కాంతారావు, రఘుపతి వెంకయ్య వంటి వారి పేర్లతో ప్రత్యేక పురస్కారాలను కూడా ఏర్పాటు చేసినట్లు జయసుధ, దిల్ రాజు వెల్లడించారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.




### 2024 సంవత్సరానికి ప్రకటించిన కొన్ని ప్రధాన అవార్డులు:

మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ
రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్
మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2)
ఉత్తమ నటి: నివేతా థామస్ (35 ఇది చిన్న కథ కాదు)
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ సహాయ నటుడు: ఎస్.జె. సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన %-% ‘నిజమే నే చెబుతున్నా’ పాటకు)
ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయ ఘోషల్ (పుష్ప 2 %-% ‘సూసేకి అగ్గిరవ్వ కళ్లెత్తితే’ పాటకు)
ఉత్తమ హాస్య నటులు: సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా 2)
ఉత్తమ బాల నటులు: మాస్టర్ అరుణ్ దేవ్ (35 ఇది చిన్న కథ కాదు), బేబీ హారిక
ఉత్తమ గీత రచయిత: చంద్రబోస్ (రాజూ యాదవ్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి).

## రవితేజ ‘మాస్ జాతర’ రిలీజ్ డేట్ ఫిక్స్



మాస్ మహారాజా రవితేజ, భాను భోగవరపు కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం ‘మాస్ జాతర’. ‘మనదే ఇదంతా’ అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమాను వినాయక చవితి సందర్భంగా ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు తాజాగా చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. దీంతో అభిమానులు వినాయక చవితి పండక్కి థియేటర్స్ లో మాస్ జాతరే అంటున్నారు. ఇక, ఈ మూవీలో రవితేజ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరూ గతంలో ‘ధమాకా’తో ప్రేక్షకులను అలరించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. కాగా, ‘ధమాకా’ తర్వాత రవితేజకు పెద్ద హిట్ దక్కలేదు. గతేడాది విడుదలైన ఈగల్, మిస్టర్ బచ్చన్ చిత్రాలు తీవ్రంగా నిరాశపరిచాయి. దీంతో ‘మాస్ జాతర’ ద్వారా రవితేజ ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో ఉన్నారు.

## క్రేజీ ప్రాజెక్ట్ దక్కించుకున్న డ్రాగన్ బ్యూటీ

ఈ ఏడాది ఆరంభంలో ‘డ్రాగన్’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ కయాదు లోహర్. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన డ్రాగన్ సినిమా సూపర్ హిట్‌గా నిలవడంతో కయాదు లోహర్ ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారింది. అంతకు ముందు తెలుగులో అల్లూరి అనే సినిమాలో నటించిన ఈ అమ్మడికి అంతగా గుర్తింపు దక్కలేదు. కానీ డ్రాగన్ సినిమాతో తెలుగులోనూ ఈమెకు మంచి పాపులారిటీ దక్కడం మాత్రమే కాకుండా టాలీవుడ్ నుంచి పిలుపు అందింది అనే వార్తలు వస్తున్నాయి. ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. అతి త్వరలోనే ఆ తెలుగు సినిమాలు ఏంటి అనే విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం తమిళ్‌లో రెండు మూడు సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు తాజాగా మలయాళ సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న ఐయామ్ గేమ్ అనే సినిమాలో కయాదుకు ఛాన్స్ దక్కిందనే వార్తలు జోరుగా వస్తున్నాయి. మలయాళ సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా దుల్కర్ సల్మాన్‌కి అన్ని భాషల్లోనూ అభిమానులు ఉన్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఈయన చేసిన ప్రతి సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే దుల్కర్ సల్మాన్ మలయాళంలో సినిమా చేస్తూ ఉన్నా కూడా తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. అలాంటి క్రేజీ స్టార్ సినిమాలో కయాదు నటించడం వల్ల కచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. ప్రస్తుతం కయాదు చేస్తున్న సినిమాల్లో అన్నింటి కంటే దుల్కర్‌తో చేయబోతున్న సినిమా ఆమెకు స్టార్‌డం తెచ్చి పెడుతుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. డ్రాగన్ సినిమాతో వచ్చిన పాపులారిటీని సద్వినియోగం చేసుకుంటూ ఉన్న కయాదు లోహర్ తక్కువ సమయంలోనే పాపులర్ స్టార్స్ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుంది. ముందు ముందు కూడా కయాదు లోహర్ సూపర్ హిట్ సినిమాల్లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు.





పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా, యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ యాక్షన్ చిత్రం ‘ఓజీ’ గురించి ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో నటుడు నారా రోహిత్ కాబోయే భార్య శిరీష నటిస్తున్నారన్న వార్త కొంతకాలంగా ప్రచారంలో ఉండగా, ఇప్పుడు ఈ విషయాన్ని నారా రోహిత్ స్వయంగా ధ్రువీకరించారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్‌తో కలిసి నటించిన ‘భైరవం’ సినిమా ప్రచార కార్యక్రమాల్లో నారా రోహిత్ చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా సాయి ధరమ్ తేజ్‌తో కలిసి చిత్ర బృందం ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ సందర్భంగా ‘ఓజీ’ సినిమా గురించి ఏదైనా తాజా సమాచారం

## ‘ఓజీ’లో నారా రోహిత్ కాబోయే భార్య

పంచుకోవాలని సాయి ధరమ్ తేజ్ కోరగా, దీనికి సమాధానంగా నారా రోహిత్ “‘ఓజీ’లో నాకు కాబోయే భార్య శిరీష నటించింది. ఈ సినిమాలో తనకు ఒక కీలకమైన పాత్ర పోషించే అవకాశం దక్కింది” అని తెలిపారు. ఈ ప్రకటనతో శిరీష ‘ఓజీ’లో నటిస్తున్నారన్న వార్తలకు అధికారిక ముద్ర పడినట్లయింది. ఇన్ని రోజులు ఈ విషయాన్ని ఎందుకు చెప్పలేదంటూ మంచు మనోజ్ నారా రోహిత్‌ను సరదాగా ఆటపట్టించాడు. ‘ఓజీ’ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ముగింపు దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ కల్యాణ్ మునుపెన్నడూ చూడని ఒక శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండగా, ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు.

## ‘హరిహర వీరమల్లు’కు పవన్ డబ్బింగ్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం హరిహర వీరమల్లు. వచ్చే నెల 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో భాగంగా పవన్ తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్‌ను పూర్తి చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. తన బిజీ షెడ్యూల్‌లోనూ రాత్రి 10 గంటలకు డబ్బింగ్ మొదలు పెట్టి నాలుగు గంటల్లోనే పూర్తి చేసినట్లు వెల్లడించారు. డబ్బింగ్‌కు సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. “పవర్ స్టార్మ్‌కి సిద్ధంగా ఉండండి. జూన్ 12న సినిమా థియేటర్లలో కలుద్దాం” అంటూ రాసుకొచ్చారు. ఇక, ఈ చిత్రాన్ని రెండు పార్టులుగా తెరకెక్కించనుండగా.. ఫస్ట్ పార్ట్ ‘హరిహర వీరమల్లు: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్’ పేరుతో జూన్ 12న విడుదలవుతుంది. పవన్ సరసన హీరోయిన్‌గా నిధి అగర్వాల్ నటించగా.. అనుపమ్ ఖేర్, బాబీ డియోల్, నోరా ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్తా, సునీల్, నాజర్, కబీర్ సింగ్, సుబ్బరాజు తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఎ.దయాకర్‌రావు ఈ మూవీని నిర్మిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతం అందించారు. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా నుంచి ఇప్పటికే విడుదలైన ‘మాట వినాలి’, ‘కొల్లగొట్టినాదిరో’, ‘అసుర హననంస పాటలతో పాటు బుధవారం విడుదలైన ‘తార తార నా కళ్లు.. వెన్నెల పూత నా ఒళ్లు’ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.